అమెరికా తెలుగు సంఘం , అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ఇది కథ కాదు సుమా!

-బి.వి.ఎస్.బాబు



హైదరాబాద్,
4.10.95

హారికగారికి,

'దీపిక' సచిత్రవార పత్రిక లో కలం స్నేహాభిమానుల శీర్షికలో మీ పేరూ, చిరునామా చూసాను. సృష్టిలో మధురానుభూతినిచ్చేది స్నేహం.ఆస్నేహం అంటేనాకు ప్రాణం.

నాకు ఫ్రెండ్స్ ఉన్నారు. కానీ మచ్చుకు ఒక్క కలం నేస్తం కూడా లేరు.

మీ హాబీలు, నా హాబీలు ఒక్కటే కావటం చేత మిమ్మల్ని ఎంచుకున్నాను. ఒక్క కలం నేస్తాన్నన్నా సంపాదించుకోవాలన్న ఆశతో మీ స్నేహ హస్తాన్ని కోరుతూ మీకీ ఉత్తరం రాస్తున్నాను.

మీరు మీ అంగీకారంతో నాకు వెంటనే ఉత్తరం రాస్తారని వేయి కళ్లతో ఎదురుచూస్తుంటాను.

మీ స్నేహాన్ని కోరే...
సురేష్

తెనాలి,
8.10.95.

సురేష్ గారికి ,

నా కలం స్నేహం కోరుతూ ఎంతో అభిమానంతో మీరు రాసిన ఉత్తరం అందింది.నాతో కలంస్నేహం కోరుతూ నాకు వందల కొద్దీఉత్తరాలు వచ్చాయి. కానీ అందరితో కలం స్నేహంచేయటం అసాధ్యం కదా!

ఒక్క కలం నేస్తాన్నన్నా సంపాదించుకోవాలన్న మీ ఆరాటాన్ని చూసి మీతో కలం స్నేహం చేయడానికి నిర్ణయించుకున్నాను.

నాగురించి చెప్పుకోడానికి ఏమీ లేవు. మా తల్లిదండ్రులకు మేము ముగ్గురం సంతానం. నేను గాక మరో ఇద్దరు చెల్లెళ్లు.

నేను బియస్సీ ఫైనల్ ఇయర్. రెండో చెల్లి ఇంటర్, మూడో చెల్లి టెన్త్ చదువుతున్నాం. మా నాన్న స్కూల్ టీచర్. అమ్మ అంతగా చదువుకోలేదు. మేమే వాళ్ళకు సర్వస్వం.మాతోటే లోకం.

ఇహపోతే ఎప్పుడూ నా వెన్నంటే ఉండే నా ముగ్గురు మిత్రురాళ్ళు దీప్తి,నళిని, సురేఖ.

మరి...మీ గురించి తెలియజేస్తారని ఆశిస్తూ...

మీ నేస్తం...
హారిక.

హైదరాబాద్,
12.10.95

హారికగారికి,

నా ఆశను అడియాశ చేయకుండా నా ఉత్తరానికి బదులిచ్చినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది.

మీరు మీ గురించి తెలియపరుస్తూ నా గురించితెలియపరచమని రాసారు. అలా తెలియపరచడం ఓ కలంస్నేహితునిగా నా విధి.నేను డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణ లో ఉన్నాను. మా నాన్నగారు బ్యాంక్ మేనేజరుగా పనిచేస్తున్నారు. తన పలుకుబడిని ఉపయోగించి నాకు ఎలాగైనా ఓ మంచి ఉద్యోగం సంపాదించిపెట్టగలరన్న నమ్మకం నాకుంది.

అమ్మ వంటింటి కుందేలు.అడపాదడపా కథలూ, కాకరకాయలంటూ పత్రికలకు తెగరాసి పడేస్తూంటుంది. ఒక్క గానొక్క చెల్లెలు టెన్త్ చదువుతోంది.

నాకంటూ నేను చెప్పుకోదగ్గ మంచిస్నేహితులు సందీప్, సురేంద్ర. మా ముగ్గురి మనస్తత్వాలు ఒక్కటే.

మీరు నాకు రాసిన ఉత్తరం వారికి చూపించాను. దానిని ఎంతో ఆసక్తిగా చదివారు. మిమ్మల్ని అడిగినట్లుగా రాయమన్నారు.

నాగురించి దాదాపుగా అన్ని విషయాలు తెలియపరిచాను.

మీ రిప్లై వెంటనే ఇస్తారు కదూ !

మీ మిత్రుడు
సురేష్.

తెనాలి,
16.10.95

సురేష్‌గారికి,

మీ ఉత్తరం అందుకున్నాను. మీ గురించి తెలియపరిచినందుకు చాలాసంతోషం. మీలాగే నేను కూడా మీ ఉత్తరాన్ని నా ఫ్రెండ్స్ కి చూపించాను. వారు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మీరెవరో తెలియకుండా , నేనెవరో మీకు తెలియకుండా మన మధ్య స్నేహాన్ని కలుపుతూ వారధిగా నిలిచిన ఈ ఉత్తరాలను చూస్తూంటే నాకు గొప్ప థ్రిల్‌గా ఉంది!

బహుశా మీకు కూడా అలాగే ఉండి ఉంటుందను కుంటాను.

నాకు ఓ మంచి కలం నేస్తం దొరికినందుకు ఆనందంతో నా గుండె ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మీ ఉత్తరం చేతికి అందగానే ఏదో తెలీని అవ్యక్తమైన అనుభూతికి లోనవుతుంటాను. అన్నట్లు...

నేటి మన సమాజాన్ని పట్టిపీడిస్తోన్న వరకట్న పిశాచంమీద మీ అభిప్రాయం ఏమిటో తెలియపరుస్తూ...

అలాగే అబ్బాయిలకు , అమ్మాయిల వెంటపడి అల్లరిచేయటం, ఏడిపించటం, కామెంట్స్ విసరటం లాంటివి హాబీలుగా మారిపోతున్నాయి.ఇది ఎంత వరకు సమంజసమో తెలుపుతూ ఉత్తరం రాయండి.

మీ నేస్తం
హారిక.

హైదరాబాద్,
20.10.95

హారిక గారికి,

మీరు ఎంతో ఆనందానుభూతులతో రాసిన ఉత్తరం ను అందుకున్నాను. ఒక మంచి కలంనేస్తం దొరికిందన్న ఆనందం మీ ఒక్కరిసొత్తే కాదు. అందులో సగభాగం నాకూ ఉంది.

మీ దగ్గిరనుండి ఉత్తరంఎప్పుడూ వస్తుందాని నేనే కాదు మా మిత్రులు కూడా ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటారు.

మీరు వరకట్న పిశాచంమీదా, టీజింగ్ మీదా నా అభిప్రాయం అడిగారు. చాలా సంతోషం.

మనం ముందు వరకట్నపిశాచం విషయానికి వస్తే అది అంత వికృత రూపందాల్చి మన సమాజం మీద విరుచుకుపడటానికి ముఖ్యకారకులు మన పెద్దలు.

అవునండీ! మన పెద్దలే దాన్ని పెంచి పోషించారు. ఈ సాంప్రదాయంలో మార్పురావాలంటే ముఖ్యంగా యువతరం చొరవతీసుకుని నడుం బిగించి ముందుకు దూకాలి.

కానీ...

అలాంటి ధైర్యం కలవారు ఎందరున్నారు ? ఎవరికి వారుతమ స్వార్థం కోసం మిన్నకుండిపోతున్నారు. ఈ అలసత్వం మూలంగా ఎంతో మంది అభాగినులు వరకట్నానికి బలైపోతున్నారు. ఏది ఏమైనా మన సమాజంలో అంత తేలిగ్గామార్పు వస్తుందని నేను మాత్రం అనుకోను సుమా!

నా వరకు నేను ఇప్పటికీ ఎప్పటికీ వరకట్నానికి బద్ధ విరోధిగానే మిగిలిపోతాను.

ఇహపోతే..

అబ్బాయిలు అమ్మాయిలను అల్లరిపెట్టటం, విడిపించడం అనేది మన సభ్యసమాజానికి ఒక మాయనిమచ్చగా మారింది. కామెంట్స్ విసరటం వరకు సబబే. కానీ ఆ కామెంట్స్ వల్ల అమ్మాయి బాధపడకూడదు. మనసు నొప్పించకూడదు. కామెంట్ అనేది ఆ అమ్మాయి అలాంటి కామెంట్ కోసం ఎదురుచూసేలా ఉండాలి. కాని అలా జరగడంలేదు. ఈవ్ టీజింగ్ రానురాను వెర్రితలలు వేస్తోంది. దానినిఅరికట్టడానికి అమ్మాయిలే ముందుకు రావాలి తప్ప ఎవరో వచ్చి పరిష్కారిస్తారన్నది అసంభవం. నా అభిప్రాయాలతో మీరూ , మీ ఫ్రెండ్స్ ఏకీభవిస్తారుకదూ!

మరో ముఖ్యవిషయం..

నా అజ్ఞాతకలం నేస్తాన్ని చూడాలన్న తహతహ నాలో బలంగా చోటు చేసుకుంది. మీకు అభ్యంతరం లేకపోతే మీ ఫోటో ఒకటి పంపగలరు. మీ మిత్రుడు,

సురేష్.

తెనాలి,
• తేదీ :24 -10-95

సురేష్ గారికి,

మీ ఉత్తరంచదివాను. మీఅభిప్రాయాలు నాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. మీకు నన్ను చూడాలని ఉందనిరాసారు. నా ఫోటోఒకటిజత చేసి పంపుతున్నాను. అలానే నా అజ్ఞాత కలంనేస్తాన్ని చూడాలన్న ఆకాంక్ష మీకే కాదు నా క్కూడా ఉంది.

అందుకనీ...

మీరుకూడా మీ ఫోటో ఒకటి జతచేసి పంపించండి.మీఫోటో కోసం నా ఫ్రెండ్స్ కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

అలస్యం చేయరుగా...

మీ నేస్తం,
హారిక.

హైదరాబాద్,
28.10.95

హారికగారికి,

మీరు రాసిన ఉత్తరంతో పాటు నా కోరికమన్నించి మీరు పంపిన మీ ఫోటో కూడా అందు కున్నాను.

ఆ ఫోటోలో మీరు ఎంతోఅందంగా ఉన్నారు. నా కలంనేస్తంఇంత అందంగా ఉంటుందని తెలిసి ఎంతో సంబరపడ్డాను. మీఅందమైన ముగ్ధమనోహర రూపాన్ని చూసి నా కనులు కదలికలు మరచాయి.

నా హృదయ స్పందన ఆగిపోయింది. నా తనువు నా వశం తప్పి విహరించింది.

సారీ,ఇలా రాస్తున్నందుకు మరోలాభావించవద్దు. మీ అందాన్ని ప్రత్యక్షంగా చూడాలనిఉంది.

మరి..

నా కోరిక ఎప్పుడు తీరుస్తారు...? బైదిబై! మీరు అడిగినట్లు గానే నా ఫోటో పంపుతున్నాను.

మీ మిత్రుడు,
సురేష్.

తెనాలి,
2.11.95

సురేష్‌గారికి,

నా అందాన్ని పొగుడుతూ మీరు రాసిన ఉత్తరం నాలో ఏదో తెలీని వింత ఆనందాన్ని కలిగించింది.

నా ఫ్రెండ్స్ కూడా నా అందం గురించి పదేపదే పొగుడుతూంటే నాలో ఏ మూలనో కించిత్ గర్వం తొంగిచూస్తున్నట్లుగా అనిపించేది. మా కాలేజీలో నాకు కాలేజీ బ్యూటీగా నిక్‌నేమ్‌పెట్టారని రాయడానికి సాహసిస్తున్నాను. అప్పటినుండీ అందం విషయంలో చాలా జాగ్రత్తలు, మెళుకువలు తీసుకుంటున్నాను.

చివరగా...

మీరు కూడా ఫోటోలో చాలా బాగున్నారు.నాకు కూడా మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడాలని ఉంది.

ఆ శుభఘడియ త్వరలో నే వస్తుందని ఆశిస్తున్నాను.

మీ నేస్తం,
హారిక.

హైదరాబాద్.
2.2.96

హారిక గారికి,


నేను గత రెండు నెలలనుండి , ప్రతి ఉత్తరంలోనూ మిమ్మల్ని చూడాలనుంధని రాస్తున్నాను. కానీ మీరుఏదో ఒక సాకు చెబుతూ తప్పించుకుంటున్నారనిమీ ఉత్తరాలద్వారా సుస్పష్టమవుతోంది. మీరు ఎందుకలాప్రవర్తిస్తున్నారో అర్థంకావటం లేదు.

మనం ముఖా ముకీ కలుసుకోవడం ఇష్టం లేకపోతే ఆ విషయం మీరు నాకు నిర్మొహమాటంగా తెలియజేసినట్లయితే మీ దగ్గర మరోసారి ఆ విషయం ప్రస్తావన తీసుకురాకుండా మిమ్మల్ని చూడాలన్న నా కోరికను బలవంతంగా చంపుకునేవాడిని.

కానీ మీరుఅలా చేయలేదు. మీకు అంత అభ్యంతరంఅయితే ఇహ ఆ ప్రస్తావనతీసుకురాను. సారీ., మిమ్మల్ని చూడలేకపోతున్నానన్న తపనతో నా మనసు గజిబిజితో నిండి ఇలారాస్తున్నానేతప్ప మీ మీద కోపంతోమాత్రం గాదనిఅర్థం చేసుకుంటారు కదూ!

మీ ఇష్టమే నా ఇష్టం.

మీ మిత్రుడు
సురేష్



తెనాలి .
తేదీ : 6-2-96

సురేష్‌గారికి,

మీ ఉత్తరం ద్వారా మీలో గూడు కట్టుకున్న మీ కోరికనుఅర్థంచేసుకున్నాను. మీ మనసును నొప్పించి ఉంటే క్షమించండి., మీకు ఇప్పటివరకు తెలియని ఓ విషయం తెలియపరిచేముందుగా మీరు నన్నుక్షమించాలి.

నాపేరు హారిక కాదు.

గిరిధరరావు !

హారిక తండ్రిని...

నేనుహైస్కూల్‌లోటీచర్‌గాపనిచేస్తున్నాను. నెలనెలా వచ్చేచాలీ చాలని జీతంతో ఎలాగోలా జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. పెద్దమ్మాయిపెళ్ళికి ఎదిగికూర్చుంది. నాకు కట్నం కానుకలిచ్చే స్తొమతలేదు.

అలాగని చూస్తూ ఊరుకోలేక ఈ మార్గం ద్వారానైనా కట్నం తీసుకోకుండా పెళ్ళిచేసుకునేందుకు ఆదర్శభావాలుగల యువకుడు కనీసం ఒక్కరైనా ముందుకు రాకపోతాడా అనే ఆశతో అంతకు మించిన ఆరాటంతో మా అమ్మాయి పేరుతో చిరునామా,హాబీలు దీపికపత్రిక్కి పంపాను . మీరు నన్ను అమ్మాయిగానే భ్రమిస్తూ నాతో కలంస్నేహం కోరారు.

నేను మా అమ్మాయి పేరుతో ఉత్తరాలు రాస్తూ వచ్చాను.మీ ఆదర్శాలు ఏమిటో పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే అసలు విషయం బయట పెడదామని నిర్ణయించుకున్నాను. కాని మీ ఉత్తరాల ద్వారా మీ ఆదర్శాలు కొంతవరకు అర్థం చేసుకున్నాను. నా ఉత్తర సారాంశంద్వారా నా మనోవ్యధ అర్థమయ్యే ఉంటుందనుకొంటున్నాను.

మా అమ్మాయిని కట్నంలేకుండా పెళ్ళి చేసుకోడానికి మీరు ముందుకొచ్చినట్లయితే అది మహద్భాగ్యంగా భావిస్తాను. ఏ విషయం తెలియజేస్తారని ఆశిస్తూ....

మరో సారి జరిగిన ఈ తప్పిదానికి మన్నించవలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు
ఓ ఆడపిల్లల తండ్రి
గిరిధరరావు.

హైదరాబాద్.
10.2.96

శ్రీ గిరిదరరావుగారికి.

మీ ఉత్తరంఅందింది. అందులోని విషయాలు అర్థం చేసుకున్నాను. నాకు ఇంతకాలం ఉత్తరాలు రాస్తున్నది అమ్మాయికాదు .ఆ అమ్మాయి పేరుతో ఆమె తండ్రి అని తెలుసుకుని ఎంతోఆశ్చర్య పోయాను.

నేను కలంస్నేహంలో జరిగే చిత్రవిచిత్రాలను ఎన్నో పత్రికల్లో చదివాను. కాని ఇటువంటి ఆశ్చర్యకరమైన అనుభవం జరగడం చాలా అరుదు. ఓ ఆడపిల్ల తండ్రిగా మీరు పడుతోన్న ఆవేదనను అర్థంచేసుకోగలను .

కానీ...

నేను కూడా మీ దగ్గర కొన్నివిషయాలు దాచాను. అవి తెలియపరిచే ముందు మీరు కూడా నన్నుక్షమించాలి. నేను మీకు తెలియపరిచిన విషయాలన్నీ అవాస్తవాలే.

నాకుపెళ్ళయ్యింది.ఇద్దరు పిల్లలుకూడా. నాకు కలంస్నేహం మీద ఉన్న మక్కువతో అలా చేయవలసివచ్చింది. ఇది ఒకరకంగా కలంస్నేహాన్ని దుర్వినియోగం చేసినట్లే అవుతుంది. నేను చేసిన ఈ తప్పును సహృదయంతో అర్థంచేసుకుని మనస్ఫూర్తిగా క్షమిస్తారని ఆశిస్తూ...

ఇట్లు
సురేష్.

## ముగింపు:

తెనాలి.
20.3.96

శంకర్ గారికి,

'దీపిక' వారపత్రిక కలం స్నేహాభిమాన శీర్షికలో మీ పేరు ,వివరాలు చూసాను. నాకు కూడా కలం స్నేహం అంటే చాలా ఇష్టం. ఆ స్నేహం లో ఉన్న మాధుర్యం మరెక్కడా లేదంటే అతి శయోక్తి కాదు.


మీ హాబీలు నాకు నచ్చాయి. ఎందుకంటే నా హాబీలు కూడా అవే.


నాతో కలం స్నేహం మీకు ఇష్టం అయితే అది ఒక వరంగా భావిస్తాను .

మీ సమాధానంకోసం నిరీక్షిస్తూ...

మీ స్నేహాన్ని కోరే
హారిక.

బి.వి.ఎస్.బాబు
కేరాఫ్ డి.ఇ.ఇ./ఆపరేషన్.
ఎ.పి.ఎస్.ఇ.బి.
తెనాలి - 522 202






కె.శ్రీనివాస్, మల్లారం(పోస్ట్) , మల్హర్(మండలం) , కరీంనగర్ (జిలా)